


జిల్లా పోలీసు కార్యాలయం

పోలీసు బాస్‌కు..

ఎన్నో సవాళ్లు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

గంజాయిపై ఉక్కుపాదం

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
- బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళంక్రైం, జూలై 15: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'నాది 2019 ఐపీఎస్ బ్యాచ్. శిక్షణ అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో ఏఎస్పీగా, రంపచోడవరంలో ఓఎస్డీగా పనిచేశా. పదోన్నతిపై సిక్కోలుకు ఎస్పీగా వచ్చాను. చింతూరు ఏఎస్పీగా చేసిన తరుణంలో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా అనుభవం ఉంది. ఇక్కడ ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో మావోల కదలికపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. గంజాయి అక్రమ రవాణాను నియంత్రిస్తాం. గంజాయి బారిన పడిన యువతను గుర్తించి వారిని రీహేబిసెంటర్‌కు తరలిస్తాం. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యుల మాదిరిగా బాధ్యత తీసుకుంటాం. ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ.. శాంతి భద్రతలు పరిరక్షిస్తాం. మహిళలపై వేధింపులు, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పోలీసుల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా పనిచేస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యలు పరిష్కరించి జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం. పోలీసుల సంక్షేమానికి తోడ్పడతామ'ని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. అనంతరం డీఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీని జిల్లా పోలీసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు.

- రెండేళ్లుగా పెరిగిన నేరాలు.. సెటిల్‌మెంట్లు
- యథేచ్ఛగా మత్తుపదార్థాల అక్రమ రవాణా
- జోరుగా బెట్టింగ్‌లు.. పట్టుబడని నిర్వాహకులు
- మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలు
- అదుపుతప్పిన శాంతిభద్రతల పరిరక్షణ

(శ్రీకాకుళం క్రైం)

ప్రశాంతత, శాంతిభద్రతలకు నియలమైన సిక్కోలులో గడచిన రెండేళ్లుగా నేరాలు పెరిగిపోయాయి. హత్యలు, దాడులు, దొంగ తనాలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు ఎక్కువయ్యాయి. గంజాయి, గుట్కావంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. న్యాయం కోసం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్ర యించిన బాధితుల సమస్యలకు సైతం పరిష్కారం చూపని దుస్థితి నెలకొంది. కొంతమంది పోలీసులు ఎక్కడికక్కడ సెటిల్‌మెంట్‌లు, అక్రమ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ.. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి సవాళ్లు విసురుతున్నాయి. పోలీసు శాఖను ప్రక్షాళన చేసి.. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లావాసులు కోరుతున్నారు.

● ఛేదించని హత్య కేసులు..

జిల్లాలో ఏటా హత్యల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఐదేళ్ల కిందట శ్రీకాకుళంలోని సింధూజ అపార్ట్‌మెంట్‌లో ఓ చెప్పుల వ్యాపారి ఇంట్లో మెహర్‌నిషా, జూనాబాయ్ అనే ఇద్దరు మహిళలను అతి కిరాతకంగా హత్య చేశారు. నిందితులు ఇంతవరకూ దొరకలేదు. ఈ కేసును పోలీసులు ఛేదించకపోగా.. గత రెండేళ్లలో ఒక్కసారి కూడా ఎస్పీ రాధిక దీనిపై నేర సమీక్షలోనూ చర్చించకపోవడం గమనార్హం.

● ఇటీవల గూనపాలెంలో వివాహేతర సంబంధాల నేపథ్యం లో ప్రియుడు అతడి స్నేహితులతో కలిసి.. ఓ మహిళ తన భర్తను హత్య చేసింది. ఈ కేసును పోలీసులు నేటికీ ఛేదించలేదు. దీని వెనుక ఉన్న ప్రధాన నిందితుడిని ఇంకా పట్టుకోలేకపోయారు. ఇలా హత్య కేసులు చాలా పెండింగ్‌లో ఉండగా నిందితులు పరారవుతున్నారు. విచారణ అధికారులు మారిపోతుండ టంతో ఈ కేసులకు పరిష్కారం దొరకడం లేదు.

పేకాటపై కొరవడిన నిఘా..

జిల్లాలో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు రెండేళ్లుగా విచ్చలవిడిగా సాగుతున్నాయి. నరసన్నపేట, ఆమదాలవలస పరిధిలోని కొత్తరోడ్, శ్రీకాకుళం ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వరకు పేకాటరాయుళ్లను తమ కార్లలో తీసుకెళ్లి.. మందు, బిర్యానీ ఇచ్చి బాగా పేకాడిస్తున్నారు. వాటిపై వచ్చే లాభాలను నెలకు రూ.లక్షల్లో వాటాలుగా వేసుకుని పంచుకునే స్థాయికి నిర్వాహకులు ఎదిగిపోయారంటే వీరిపై పోలీసింగ్ నిఘా ఎంత ఉందో అర్థమవుతోంది. పోలీసులు అడపాదడపా పేకాట శిబిరాలపై దాడులు చేసి.. నిర్వాహకుల నుంచి కొంతమొత్తం తీసుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

● జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఏటా ఐపీఎల్ సీజన్‌లో.. రూ.కోట్లలో ఆర్జిస్తున్నారు. రోజు కూలీ స్థాయి నుంచి కోటీశ్వరులుగా మారిన క్రికెట్ బుకీలు జిల్లా కేంద్రంలో ఉన్నారు. గడిచిన రెండేళ్లలో క్రికెట్ బెట్టింగ్ నియంత్రణపై పోలీసులు పట్టించుకోలేదు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఒక్క క్రికెట్ బెట్టింగ్ కేసు కూడా నమోదు కాకపోవడం గమనార్హం.

● జోరుగా.. గంజాయి, గుట్కా రవాణా

ఒడిశా సరిహద్దుకు శ్రీకాకుళం ఆనుకుని ఉంది. దీంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలకు గంజాయి రవాణా చేసేందుకు జిల్లా ప్రధాన రహదారి మార్గంగా మారింది. జిల్లా మీదుగా నిత్యం గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. ఇటీవల ఎన్నికల నేపథ్యంలో కేవలం రెండు నెలల్లోనే జిల్లాలో వేలాది టన్నుల గంజాయి నిల్వలు పట్టుబడ్డాయి. గంజాయి ముఠా ఆగడాలు పెరుగుతూనే ఉన్నాయి. అలాగే ఒడిశా నుంచి జిల్లాకు ఖైనీ, గుట్కా యథేచ్ఛగా సరఫరా అవుతోంది. జిల్లాకేంద్రంలోని ఖైనీ, గుట్కాల నిల్వలకు ఓ పెద్ద గోడౌన్‌ను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నారు.

వాటాలు, పంచాయితీలే.. స్టేషన్లలో ప్రధాన మార్గాలు!

గత ఎస్పీ హయాంలో పోలీసు అధికారులు కేసులు నమోదు చేయడమే మరిచిపోయారన్న విమర్శలు ఉన్నాయి. పోలీసుస్టేషన్లలో పంచాయితీలు అధికమయ్యాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్నిచోట్ల క్రైం, జనరల్ డ్యూటీ కానిస్టేబుళ్లే కేసులు రాజీ చేసి పంచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక సివిల్ తగాదాల్లో ఎక్కువ మొత్తం డబ్బులు డిమాండ్ చేసి.. సెటిల్‌మెంట్ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని స్టేషన్లలో ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయిన వారిని.. గతంలో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారి తన అనుచరగణం సూచన మేరకు.. వారిని మళ్లీ జిల్లా కేంద్రానికి తీసుకొచ్చి నియమించారు. దీంతో స్టేషన్‌లో అధికారి సైతం పంచాయితీలపై నోరు మెదపలేని స్థితి నెలకొంది.

● ట్రాఫిక్ సమస్య.. రోడ్డు ప్రమాదాలు

శ్రీకాకుళంలో ట్రాఫిక్ సమస్య కొన్నేళ్లుగా పోలీసులకు తలనొప్పిగా మారింది. వాహనాల నిలుపుదలకు పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా పోలీసు కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఆర్ట్స్ కళా శాల రోడ్డులో వాహనాలు ఇష్టారాజ్యం పార్కింగ్ చేస్తు న్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. పార్కింగ్ స్థలాల కోసం నగరపాలక అధికారులతో పోలీసులు చర్చించి.. ఓ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

● జిల్లాలో మైనర్ల త్రిబుల్ రైడింగ్‌లతోపాటు శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో స్పోర్ట్స్ బైక్ రేసులు పాదచారులకు ప్రాణ సంకటంగా మారింది. ఇటీవల ఎచ్చెర్ల మండలానికి చెందిన ఓ సచివాలయ ఉద్యోగిని.. శ్రీకాకుళంలోని వినాయకుడి గుడి వద్ద ద్విచక్రవాహనంతో రోడ్డు క్రాస్ చేస్తుండగా.. మరోవ్యక్తి అతి వేగంగా బైక్‌పై వచ్చి ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే తరహాలో కళింగపట్నంలో విధులు నిర్వహిస్తున్న మరో సచివాలయ ఉద్యోగిని సూర్యమహల్ కూడలి వద్ద ఆటో దిగుతూ.. రోడ్డు ప్రమాదంలో మరణించింది.

● రాత్రిపూట గంజాయి మత్తులో యువత రోడ్లపై సైలెన్సర్ల మోత మోగిస్తూ.. అతివేగంతో దూసుకుపోతూ.. ఎదురుగా వస్తున్న ప్రాణాలను హరిస్తున్నారు.

● ఫిర్యాదు చేసినా.. 'స్పందన' శూన్యం

జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో బాధితులకు న్యాయం జరగకపోవడంతో చాలామంది.. శ్రీకాకుళంలోని ప్రతి సోమవారం నిర్వహించే ఎస్పీ 'స్పందన' కార్యక్రమానికి వచ్చేవారు. తమ సమస్యలపై నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేసినా.. 'స్పందన' లేదని బాధితులు వాపోతున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ కొందరు మళ్లీ మళ్లీ ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో 'మీ కోసం' పేరిట నిర్వహించిన ఫిర్యాదుల కార్యక్రమానికి 37 వినతులు రాగా.. అందులో పాత వినతులే పది వరకూ ఉన్నాయి. ఇలా న్యాయం కోసం బాధితులు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

● రౌడీషీటర్లపై కొరవడిన నిఘా!

రౌడీషీటర్లపై పోలీసు నిఘా కొరవడింది. శ్రీకాకుళంలోని పలు ప్రాంతాల్లో సామాన్య ప్రజలపై రౌడీషీటర్ల దాడులు పెరిగిపోయాయి. పేకాట నిర్వాహణలో అధిక శాతం వాటాదారులుగా రౌడీషీటర్లే కావడం కొసమెరుపు. జిల్లాలో సుమారు 400 మంది రౌడీషీటర్లు ఉండగా.. వారిలో చాలామంది సెటిల్‌మెంట్లు, భూదందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అలాగే అప్పు ఇచ్చి.. అధిక వడ్డీల వసూళ్లు వీరి దినచర్యగా మారింది. ఈ క్రమంలో కొన్నిస్టేషన్లలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు సైతం రౌడీషీటర్లు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● పాతుకు పోయిన సిబ్బంది..

జిల్లా పోలీసు కార్యాలయంలో కొంతమంది సిబ్బంది పది నుంచి పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తించడంతో విమర్శలకు తావిస్తోంది. పోలీసు శాఖ ఉన్నతాధికారులతో పరిచయాలు పెంచుకుని.. బదిలీ కాకుండా మేనేజ్ చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఏళ్లతరబడి ఇక్కడ పాతుకుపోయి చక్రం తిప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వీటిపై జిల్లా పోలీసు కార్యాలయంలోని సిబ్బంది మధ్య చిన్నపాటి మనస్పర్ధలు నెలకొన్నాయి. ఇలాంటి వాటిపై కొత్త ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ఉంది.

మంత్రి అచ్చెన్నను కలిసిన ఎస్పీ..

టెక్కలి, జూలై 15: వ్యవసాయ, పశుసంవర్థక శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును.. సోమవారం నూతన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో అచ్చెన్నకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఈయనతోపాటు డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఉన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

త్వరగా ఫిర్యాదులు పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 15: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆలస్యానికి తావు లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'మీ కోసం'లో ఆయన జేసీ ఎం.నవీన్‌తో కలిసి 191 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులు పూర్తి సంతృప్తి చెందేలా నిర్దేత సమయంలోగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రతీ జిల్లా అధికారి ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. నిర్దేత సమయంలోగా పూర్తి సమాచారంతో వివరణ జారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ రామ్మోహనరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో ఆర్మీ హవల్దార్ మృతి

- వల్లభరాయుడుపేటలో విషాదం



జగదీశ్వరరావు (ఫైల్)

నందిగాం, జూలై 15: నందిగాం మండలం వల్లభరాయుడుపేటకి చెందిన ఆర్మీ హవల్దార్ సనపల జగదీశ్వరరావు(40) ఉగ్రదాడిలో మృతి చెందారు. సోమవారం ఉదయం జమ్మూకాశ్మీర్ పరిధిలోని అనంతనాగ ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల ఎదురుదాడుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. జగదీశ్వరరావు 2003లో ఆర్మీ జవాన్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లో హవల్దార్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో భాగంగా ఉగ్రవాదులను అంతమొందించే క్రమంలో ఎదురుదాడుల్లో మృతి చెందారు. దీంతో తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, నారాయణమ్మ, భార్య సమత, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. దేశ సేవలో తరించి.. విధి నిర్వహణలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ బోరున విలపించారు. జగదీశ్వరరావుకు భార్య సమతతోపాటు ఇద్దరు కుమార్తెలు మోక్షప్రియ(8), దీక్షిత(6) ఉన్నారు. సమత నందిగాం మండలం దిమిలాడ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమె టెక్కలిలో ఉంటూ పిల్లలను చదివిస్తోంది. భర్త మరణవార్త విని ఆమె బోరున విలపిస్తూ టెక్కలి నుంచి వల్లభరాయుడుపేటకి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. జగదీశ్వరరావు సోదరుడు విఘ్నేశ్వరరావు కూడా ఆర్మీ ఉద్యోగి. జగదీశ్వరరావు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.



శ్రీకాకుళం : ఇలిసిపురంలోని మారు రథయాత్రలో భక్తుల పూజలు

జై.. జగన్నాథ

- వైభవంగా మారు రథయాత్ర



ఇచ్ఛాపురంలో..

శ్రీకాకుళం కల్చరల్/ఇచ్ఛాపురం, జూలై 15: జిల్లాలో జగన్నాథస్వామి మారు రథయాత్ర ఉత్సవం వైభవంగా సాగింది. అలంకరించిన రంగుల రథాలపై కొలువు తీరిన సుభద్ర, బలభద్ర జగన్నాథుని రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని.. జైజగన్నాథ అంటూ స్వామిని దర్శించుకున్నారు. శ్రీకాకుళంలోని ఇలిసిపురంలో జగన్నాథ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో వేంచేసి గుడించా మందిరం నుంచి బాలు పాణిగ్రాహీ ఆధ్వర్యంలో ఊరేగించారు. బొందిలీపురంలో ఉన్న స్వామి మందిరానికి మేళతాళాలతో తీసుకెళ్లారు. దారి పొడవునా భక్తులు స్వామిని దర్శించుకుని హారతులు పట్టారు. ఇచ్ఛాపురంలోనూ జగన్నాథస్వామిని.. ఇంద్రజిమ్మం(గుడించా మందిరం) నుంచి శ్రీవారి సుధామం(ఆలయం) వరకూ ఊరేగించారు. సంప్రదాయ బద్ధమైన శంఖుమేళా, కళాకారులతో పంజాబీడోలా, విచిత్ర వేషాధారణలు, భజగోవింద గోష్ఠి, మంగళవాయిద్యాల మధ్య రథయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా.. అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, టౌన్ ఎస్సై సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఇచ్ఛాపురం : రథయాత్ర ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రారంభించాక పనులా..?

- నాలుగు నెలల తర్వాత మొదలెట్టిన వైనం
- ఎన్నికలకు ముందు అధికారుల హడావుడి
- తమ్మినేని సీతారాంచే కానిచ్చేసిన వైనం
- ఇదీ గిడ్డంగుల సంస్థ నిర్వాకం

(సరుబుజ్జిలి)

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో సరుబుజ్జిలిలో నిర్మిస్తున్న గోదాములు నాలుగు నెలల కిందట ప్రారంభించగా.. నేటికీ పనులు చేపడుతుండడం చర్చనీయాంశమవుతోంది. ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించేసి.. నాణ్యతకు తిలోదకాలిస్తూ ఇప్పుడు పనులు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సరుబుజ్జిలిలో ఉన్న ఆమదాలవలస వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన స్థలంలో గిడ్డంగుల సంస్థకు చెందిన గోదాములు నిర్మించడానికి రూ.8.72 కోట్లు మంజూరు చేసింది. నెల్లూరుకు చెందిన నిర్మాణసంస్థకు బాధ్యతలు అప్పగించగా పనులు ప్రారంభించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా.. వైసీపీ ప్రభుత్వానికి అండగా నిలిచిన గిడ్డంగి అధికారులు.. పనులు పూర్తికాకుండానే ఈ ఏడాది మార్చి 14న అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాంతో గోదామును ప్రారంభించేశారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఈ నిర్మాణాలపై సరైన పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. పదివేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం ఉన్న ఈ రెండు గోదాముల నిర్మాణంలో నాణ్యత లోపించిందనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే సుమారు 40 టన్నులు బరువుతో లారీలు తిరగాల్సిన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రహదారులు కూడా అధ్వానంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెటల్ గ్రావెల్‌తో నిర్మించాల్సిన ఈ రహదారులపై బురద కంకర వేస్తూ రోలింగ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల మోస్తరు వర్షం కురవగా.. సాధారణ ట్రాక్టర్లు రాకపోకలు సాగించే సమయంలో ఈ రహదారి కుంగిపోయి చిత్తడిగా మారిందని పేర్కొంటున్నారు. నాణ్యతలేని ఈ రహదారిపై భవిష్యత్‌లో ఇంకెన్ని ఇబ్బందులు ఎదురవుతాయోనని చర్చించుకుంటున్నారు. ఈ విషయమై విజయవాడకు చెందిన డీఈ శ్యామ్ వద్ద ప్రస్తావించగా.. నిబంధనల మేరకు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎటువంటి లోపాలు ఉన్నా రెండేళ్ల వరకూ నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దేనని తెలిపారు.



గోదాం ప్రారంభమైనా.. కొనసాగుతున్న పనులు

జయశంకర్ వర్సిటీలో బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

● ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందినవారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.



ముఖ్య సమాచారం

- ◆ **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- ◆ **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- ◆ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- ◆ **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19. ◆ **వెబ్‌సైట్:**www.pjtsau.edu.in

దిక్సూచి DIKSUCHI

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట్-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీఎస్సీ ఆనర్స్

- ✦ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- ✦ పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ✦ ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ✦ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- ✦ పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- ✦ బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ల ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ✦ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం. ✦ పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ✦ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- ✦ పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/JKenkieలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాజ్‌తరుణ్ ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్





రాజ్‌తరుణ్, లావణ్య, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎపిసోడ్ సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌లోకి కొత్త పాత్ర ఎంటర్ అయింది. తన కుమారుణ్ని ట్రాప్ చేసి, మాల్వీ ఆస్తి కాజేసిందని ముంబై నిర్మాత యోగేశ్ తల్లి సంచలన ఆరోపణలు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యోగేశ్, మాల్వీ కాల్ లిస్ట్‌ను కూడా ఆమె బయట పెట్టారు. ఆమె వెల్లడించిన సమాచారం ప్రకారం యోగేశ్ ముంబైలో ఓ చిన్న నిర్మాత. తన చిత్రంలో నటించడానికి వచ్చిన మాల్వీతో ప్రేమలో పడ్డారు యోగేశ్. వీళ్లిద్దరూ రెండేళ్లు సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తనని పెళ్లి చేసుకోవడానికి యోగేశ్ నిరాకరించాడనీ, కత్తితో తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడనీ ఆరోపిస్తూ మాల్వీ కేసు పెట్టడంతో యోగేశ్‌ను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాల్వీ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని, తప్పుడు కేసులు పెట్టి తన కుమారుడిని జైలుకి పంపించిందని యోగేశ్ తల్లి వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య కేసులో మాల్వీ ఇన్‌వాల్వ్ అయిన విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాననీ, అందుకే మాల్వీ బండారం బయటపెట్టాలని వీడియో విడుదల చేస్తున్నాననీ, తన కొడుకు ఇంకా జైలులోనే ఉన్నాడనీ, మాల్వీ అతని కెరీర్‌ను సర్వనాశనం చేసిందని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు యోగేశ్ తల్లి.



ఆ లోటు తీర్చేలా 'డార్లింగ్'

నాని

ప్రియదర్శి, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ "ఈ మధ్య కామెడీ చిత్రాలు తక్కువైపోయాయి. ఆ లోటు తీర్చేలా వచ్చే చిత్రమే 'డార్లింగ్'. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. త్వరలోనే జగదీశ్ అనే కొత్త డైరెక్టర్‌తో మా నిర్మాణ సంస్థలో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇందులో ప్రియదర్శినే హీరో" అని చెప్పారు. "ఈ సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్. నాకు నటన పరంగా నానినే రోల్ మోడల్" అని ప్రియదర్శి అన్నారు. "కపుల్స్ మధ్య జరిగే సరదా సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు" అని దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పారు. "ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత కె.నిరంజన్ రెడ్డి తెలిపారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్‌చరణ్ విగ్రహం?



లండన్‌లో ఉన్న మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మన హీరో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. రామ్‌చరణ్ పాపులారిటీ, ఆయన ఫాలోయింగ్‌ను గమనించిన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన విగ్రహం తయారీలో సహకరించడం కోసం రామ్‌చరణ్ లండన్‌లోనే ఉన్నారు. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. రామ్‌చరణ్ ఫ్రెంచ్ బార్బేట్ జాతికి చెందిన ఓ కుక్క పిల్ల రైమ్‌ను పెంచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏ దేశం సందర్శించినా తమతో పాటు రైమ్‌ను తీసుకెళ్లడం రామ్‌చరణ్ దంపతులకు అలవాటు. అందుకే రైమ్‌ను ఎత్తుకుని ఉన్న రామ్‌చరణ్ మైనపు బొమ్మనే మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేయనున్నారని సమాచారం.

అందుకే ఆ పెళ్లికి వెళ్లలేదు

తాప్సీ



అపర కుబేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహం రాధికతో జరిగిన సంగతి విదితమే. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు భారతీయ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆడారు, పాడారు. నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అయితే ఈ పెళ్లికి వివిధ కారణాల వల్ల హాజరు కాని సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తను ఆ పెళ్లికి ఎందుకు వెళ్లలేదో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడిస్తూ ఆసక్తికరమైన వాఖ్యలు కూడా చేసింది. 'నాకు వాళ్లతో వ్యక్తిగత పరిచయం లేదు. నా ఉద్దేశంలో పెళ్లి అనేది అనుబంధాలతో కూడిన వేడుక. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య ఏదో రకమైన అనుబంధం ఉండి తీరాలి. అటువంటి వివాహాలకే నేను హాజరవుతా. తెలియని వారి ఇంట జరిగే పెళ్లికి వెళ్లి ఇబ్బంది పడలేను' అని తాప్సీ చెప్పింది. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడడం మొదటినుంచీ తాప్సీకి అలవాటు. అందుకే అంబానీ ఇంట పెళ్లి గురించి కామెంట్ చేయడానికి ఆమె వెనుకాడలేదు.

థౌజండ్ వాలా టపాసులు



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సినిమా హిట్ అనిపించుకుంటే సరిపోదు.. కలెక్షన్లలో సునామీ సృష్టించి.. నిర్మాతలకు లాభాల పంట పండించాల్సిందే. వసూళ్ల పరంగా ఒకప్పుడు రూ.వంద కోట్ల కలెక్షన్స్ సాధించడమే అద్భుతమనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా కలెక్షన్ల లెక్కలు మారిపోయాయి. రూ.వంద కోట్లు .. రూ.రెండు వందల కోట్లు.. రూ.మూడు వందల కోట్లు.. రూ..నాలుగు వందల కోట్లు.. రూ.ఐదొందల కోట్లు... ఇదీ లెక్క ఇప్పుడు. అలా పెరుగుతూ వచ్చిన కలెక్షన్ల లెక్కలకు తాజా టార్గెట్ రూ. వెయ్యి కోట్లు. తాజాగా 'కల్కి' చిత్రం రూ. వెయ్యి కోట్ల రికార్డును సాధించడంతో తెలుగు సినిమా సత్తా మరోసారి చాటిచెప్పినట్లయింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతవరకు రూ. వెయ్యికోట్లు వసూలు చేసిన చిత్రాల సంఖ్య ఏడైతే వాటిలో మూడు సినిమాలు మనవే కావడం గర్వంతో కాలర్ ఎగరెయ్యాల్సిన అంశమే.

'యుద్ధం.. యుద్ధం' అంటూ బరిలోకి దిగి బాక్సాఫీస్‌ను షేక్ చేశారు ఆమిర్ ఖాన్. ఆయన నటించిన 'దంగల్' చిత్రం 2016లో రిలీజై.. అప్పటివరకూ ఉన్న సినిమా రికార్డులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. గ్లోబల్ బాక్సాఫీస్ దగ్గర రూ.2వేలపై చిలుకు కలెక్షన్లను సాధించింది. ఈ సినిమా మల్లయోధుడు మహావీర్‌సింగ్ ఫోగట్, ఆయన కుమార్తెల జీవితాల్లోని సంఘటనల ఆధారంగా తెరకెక్కింది.


కలెక్షన్లలో 'మాహిష్మతీ సామ్రాజ్య' విజృంభన

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి'కి కొనసాగింపుగా వచ్చిందే 'బాహుబలి 2'. 2017లో రిలీజైన ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమ హద్దులు దాటి ప్రపంచవ్యాప్త హిట్‌గా నిలిచి.. అసలు సిసలు పాన్ ఇండియా సినిమా సక్సెస్ అంటే ఎలా ఉంటుందో అందరికీ రుచి చూపించింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రూ.1810 కోట్లు కలెక్షన్ల మార్క్ అందుకుంది.

'అసలు సిసలు మల్టీస్టారర్'

దర్శకధీరుడు రాజమౌళి రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌తో చేసిన మ్యాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆర్ఆర్ఆర్'. ఈ కల్పిత పీరియాడికల్ యాక్షన్ డ్రామాలోని పోరాటఘట్టాలు.. పాటలు చూసి పరదేశీయులు ఫిదా అయ్యారు. ఈ సినిమాతో రాజమౌళి సినిమాలకు గ్లోబల్ క్రేజ్ పీక్స్‌కు చేరింది. ఇందులోని 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. హాలీవుడ్ దిగ్గజ దర్శకులు జేమ్స్ కామెరూన్, రూసో బ్రదర్స్ ప్రశంసలు పొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1400 కోట్లు వసూళ్లు చేసింది.





'రాకీ భాయ్' మానియా

యష్ నటించిన 'కేజీఎఫ్'తో కన్నడ ఇండస్ట్రీ వైపు దేశం మొత్తం చూసేలా చేసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'కేజీఎఫ్ 2'తో కన్నడ సినిమా స్థాయి గ్లోబల్ రేంజ్‌కు ఎదిగింది. యాక్షన్ ప్రియులకు అత్యంత చేరువైన ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్లను కలెక్ట్ చేసింది.

'వింటేజ్ కింగ్ ఖాన్' ప్రభంజనం

వరుస ఫ్లాపుల్లో ఉన్న షారుక్ ఖాన్‌ను మళ్లీ హిట్ ట్రాక్‌లోకి ఎక్కించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.వెయ్యి కోట్లు పైచిలుకు కలెక్షన్లను రాబట్టింది. ఇందులో రా ఏజెంట్‌గా షారుక్, ఐఎస్ఐ ఏజెంట్ పాత్రలో నటించిన జాన్ అబ్రహమ్‌తో చేసిన పోరాటాలు సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

'జవాన్' మ్యాజిక్

తమిళ దర్శకుడు అట్లీతో షారుక్ ఖాన్ చేసిన సినిమా 'జవాన్'. సమాజాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడడానికి తండ్రిగా.. కొడుకుగా షారుక్ ఇందులో డ్యూయెల్ రోల్ పోషించారు. అత్యద్భుత పోరాట ఘట్టాలతో అందరినీ కట్టిపడేసిన ఈ చిత్రం దాదాపు రూ.1200 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టింది.

'కల్కి' హవా

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'కల్కి 2898 ఏ.డీ'. జూన్‌లో విడుదలైన ఈ సినిమాలో పురాణాల్ని, సైన్స్ ఫిక్షన్‌ను మిళితం చేసి దర్శకుడు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇందులో అమితాబ్, ప్రభాస్ మధ్య వచ్చే పోరాట ఘట్టాలు.. కాంప్లెక్స్, కాశీ, శంభల ప్రాంతాల విజువల్స్. పతాక సన్నివేశాల్లో ప్రభాస్ కర్ణుడిగా కనిపించే దృశ్యం సినిమా విజయాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. రిలీజైన 15 రోజులకే రూ.1000 కోట్ల కలెక్షన్లను అందుకుని.. మరిన్ని రికార్డులు నెలకొల్పే దిశగా దూసుకుపోతోంది.

ఓ మంచి సినిమా మీకు ఇవ్వబోతున్నా



'క' అనే ఒకే ఒక్క పదం టైటిల్‌తో హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రం ట్రేడ్‌లో ఇప్పుడు ఆసక్తిగా మారింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం త్వరలో తెలుగు సహా తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మూడు 'క' లను నమ్ముకుని ఈ 'క' చిత్రం తీశాను. మొదటి క.. కథ. చాలా కథలు విని విభిన్నంగా ఉన్న ఈ చిత్రకథను ఎన్నుకున్నాం. రెండో క.. కిరణ్ అబ్బవరం., మూడో క.. కల. ఒక మంచి సినిమా తీసి పదిమందికి తోడుగా ఉండాలన్నది నా కల, అది ఈ సినిమాతో నెరవేరుతోంది. దర్శకులుగా పరిచయమవుతున్న సందీప్, సుజిత్ తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'ఎటువంటి కథనైనా తెర పైకి తీసుకురావడానికి ధైర్యం కావాలి. కిరణ్ మాకు సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్‌ను ఇచ్చారు. కొత్త డైరెక్టర్స్‌కు అలాంటి టీమ్ దొరకడం అదృష్టమే' అన్నారు దర్శకుల్లో ఒకరైన సుజిత్. మరో దర్శకుడు సందీప్ మాట్లాడుతూ 'ఎంతో రిసెర్చ్ చేసి, 80ల కాలం నాటి వస్తువులను సేకరించి, హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా తీశాం. ఫ్యామిలీ వాతావరణాన్ని క్రియేట్ చేసి మేం టెన్షన్ లేకుండా పని చేసే అవకాశాన్ని కిరణ్ కల్పించారు. 'క' అంటే కిరణ్ అబ్బవరం కాదు.. ఇందులో ఒక ప్రధాన పాత్ర ఉంది. అదేమిటో థియేటర్లలోనే చూడాలి' అన్నారు.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'వీడి పని అయిపోయింది' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిందా లేదా అనేది మనకు మాత్రమే తెలుసు. అలాగే నా పని అయిపోయిందా లేదా అనేది నాకు తెలుస్తుంది. అలా అనిపించినప్పుడు సినిమాలు చేయను. 'క' సినిమా మొదలై ఏడాదిన్నర అయింది. ఒక మంచి సినిమా కోసం మేమంతా కష్టపడ్డాం. ఒక మంచి సినిమాను మళ్లీ మీకు ఇవ్వబోతున్నా. మీ ప్రేమను పొందడానికి ఎదురు చూస్తున్నా. 'క' ప్రొడక్షన్ వర్క్ అంతా రహస్య చూసుకుంది. సినిమా రీచ్ అయ్యాక మాట్లాడతా అని చెప్పింది. అందుకే ఇక్కడికి రాలేదు' అన్నారు.

నటుడు రక్షిత్ శెట్టిపై కేసు



కాపీరైట్ ఉల్లంఘించారనే ఆరోపణలతో శాండల్‌వుడ్ నటుడు రక్షిత్‌శెట్టిపై కేసు నమోదైంది. 'న్యాయ ఎల్లిదె..?', 'గాలి మాతు' అనే రెండు సినిమాల పాటలను అనుమతి లేకుండా ఆయన వినియోగించుకున్నారని ఎంఆర్‌టీ మ్యూజిక్ సంస్థ భాగస్వామి నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బెంగళూరు యశ్వంతపుర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రక్షిత్‌శెట్టిని పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఇష్టపడి చేసిన సినిమా



బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రవికృష్ణ మీడియాతో ముచ్చటించారు. "నాకు రియల్ లైఫ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కే చిత్రాలంటే చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర బాగా నచ్చి కథ విన్న వెంటనే ఒప్పేసుకున్నాను. ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది." అని చెప్పారు.

పారదర్శక పాలనకు ప్రభుత్వం కృషి

● అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
● వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూలై 15: ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాలను బలోపేతం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన పంటలకు, పశుపోషణ ప్రోత్సాహానికి శతశాతం అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. లక్ష్యాలను చేరుకునేందుకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



టెక్కలి: వివిధ శాఖల అధికారులతో సమీక్షిసున్న మంత్రి అచ్చెన్నాయుడు

శాలువాలు, బొకేలు తేవొద్దు

అభిమానులు, నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం వస్తున్నారని, బొకేలు, శాలువలు, పూలదండలు తేవడం వల్ల సమయపాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇకపై ఇటువంటివి తీసుకు రావద్దని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. తన వద్దకు వచ్చేవారి అభిమానమే పదివేల పూల దండలతో సమానమన్నారు. ఇకపై తన వద్దకు వచ్చే వారు ఒట్టి చేతులతో రావాలని ఆయన కోరారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: రైతులు అవసరాల మేరకు సాగునీటిని పొదుపుగా వాడుకొని శివారు భూములకు నీరందేలా తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పెద్దదూగాం వద్ద వంశధార ప్రధాన ఎడమకాలవపై ఉన్న 24 నరసన్నపేట బ్రాంచి కాలువకు సోమవారం సాగునీటిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన నీటి ప్రవాహానికి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటిపై నిర్లక్ష్యం చూపడం వల్ల శివారు భూములకు సాగునీరందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంట నే సాగునీటి విడుదలే లక్ష్యంగా చర్యలు తీసుకున్నామన్నారు. 24 ఎన్‌బీసీ కాలువ ద్వారా నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాలకు చెందిన 36, 337 ఎకరాలకు నీరందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు బగ్గు గోవిందరావు, మెండ రాంబాబు, గుండ మన్మథరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, టి.సతీష్, కింజరాపు సత్యం, పిరియా వెంకటరావు, తర్ర బలరాం, వంశధార డీఈ శ్రీహరి, ఏఈలు సురేష్, శ్యామలరావు పాల్గొన్నారు.



నీటి ప్రవాహానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని మంజూరు చేయండి

● మంత్రి నారా లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే గౌతు శిరీష



మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్నచౌదరి

పలాస, జూలై 15: పలాస నియోజకవర్గంలో యువత నైపుణ్యం వెలికితీసి ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు ఐటీ, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను సోమవారం అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పలాసను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికతో ముం దుకు వెళ్తున్నామన్నారు. 'ప్రతి చేతికి పని-ప్రతి చేనుకు నీరు' అనే సంకల్పంతో వెళ్తున్న తాము ఇప్పటికే వంశధార నీటిని శివారు భూముల వరకు తీసుకువచ్చామన్నారు. మత్స్యకార యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సీమెన్, మర్చంట్ నేవీ వంటి అంశాల్లో శిక్షణ కేంద్రం మంజూరు చేస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్దానంలో కొబ్బరి, జీడి అధికంగా సాగవుతోందని, చిన్నతరహా, కుటీర పరిశ్రమ లు ఏర్పాటు చేస్తే అదనపు ఆదాయం వస్తుందన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆమెతో పాటు పలాస నియోజకవర్గ ఇన్ చార్జి యార్లగడ్డ వెంకన్నచౌదరి ఉన్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం/ హిరమండలం/ ఎల్ఎన్‌పేట/ మెళియాపుట్టి/ కొత్తూరు: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, అందువల్ల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా సోమవారం పాతపట్నం, హిరమండలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతకు, మానవాళి మనుగడకు మొక్కలు నాటడం అత్య వసరమన్నారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో వేతనదారులకు వివిధ రకాల మొక్కలను అందిస్తామని, వాటిని నాటి పరిరక్షించాలని కోరారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, సర్పంచ్‌లు అంపోలు శ్రీదేవి, లంక రోజారాణి, రవ్వల అనురాధ గణ పతిరావు, అప్పారావు, లోతుగెడ్డ భగవాన్ దాసునాయుడు, ఎంపీటీసీ చింతాడ బుడ్డు, మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, టీడీపీ నేతలు మధు, మద్దు రామారావు, టి.తిరుపతిరావు, జి.కామేశ్వరరావు, సాయికృష్ణ పట్నాయక్, ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, నాయకులు కె.కృష్ణమాచారి, వి.గోవింద రావు, బాస్కర్‌గౌడ్, బి.పరమేష్‌రెడ్డి, చింతాడ కోటేశ్వరరావు, ఎద్దు దాసునాయుడు, ఎంపీడీవోలు స్వరూపరాణి, త్రివిక్రమరావు, ఏపీవోలు శ్రీదేవి, ఎ.సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: ఆర్ఎల్‌పురం పెద్దచెరువుగట్టుపై మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

బొర్రంపేట(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం ఉపాధి పనుల్లో భాగంగా మొక్కలు నాటిన ఆయనను పలువురు గ్రామస్థులు కలిసి వినతిపత్రాలు అందించారు. సిద్దాంతం రోడ్డు జంక్షన్ నుంచి మల్లి కార్జున పురం వరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు ఎస్.రామచంద్రరావు, జి.రామశంకర్, కె.సింహాచలం, బి.హరి, ఎస్.మల్లేశ్వరరావు తదితరులు వినతిపత్రం అందించారు. సంబంధిత విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

వంశధార కుడి కాలువ ద్వారా నీరు విడుదల

హిరమండలం: గొట్టా బ్యారేజి కుడి ప్రధాన కాలువ ద్వారా సోమవారం సాగు నీటిని విడుదల చేశారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఈనెల మొదటి వారంలో నీరరు విడిచి పెట్టిన సంగతి తెలిసిందే. కుడి కాలువలో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టడంతో 12 రోజులు ఆలస్యంగా నీటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం వంశధార నదిలో ఇన్‌ఫ్లో తక్కువగా వస్తుండడంతో 100 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ, శ్రీకాకుళం రూరల్ మండలాలకు చెందిన 84 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు వంశధార అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎడమ కాలువ ద్వారా 1180 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. కాగా నదిలో 1000 క్యూసెక్కులు మాత్రమే ఇన్ ఫ్లో వస్తుండడంతో కాలువల ద్వారా నీటిని తక్కువగా విడుదల చేస్తున్నట్లు వంశధార అధికారులు చెబుతున్నారు. బ్యారేజి వద్ద 38.05 నీటి మట్టం కొనసాగుతోందని తెలిపారు.



గొట్టా బ్యారేజి కుడి కాలువ ద్వారా ప్రవహిస్తున్న సాగునీరు

గిరిజనులకు పట్టాలిచ్చి సాగు హక్కు కల్పించాలి

జలుమూరు: తరతరాలుగా భూములను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న మాకివలస గిరిజనులకు పట్టాలిచ్చి సాగు హక్కు కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబయోగి డిమాండు చేశారు. జలుమూరులో సోమవారం గిరిజనులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతతండ్రుల నుంచి సాగుచేసుకొని జీవనం సాగిస్తున్న భూములను కాజేసేందుకు ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన ఊణ్ణ సత్యనారాయణ గుప్త, అతని తమ్ముడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు వంకల మాధవరావు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాపారావు, ఉత్తరయ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో సేతు మాధవ్ ప్రతిభ

టెక్కలి: ఫ్రాన్స్‌లో ఆదివారం ముగిసిన లాప్లాగ్నే అక్సెషన్ ఇంటర్నేషనల్ కేటగిరిలో చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన యేళ్లమహంతి సేతుమాధవ్ చాంపియన్‌గా నిలిచాడు. తొమ్మిది రౌండ్ల లో ఏడు రౌండ్లు గెలిచి రెండు గేమ్‌లు డ్రా చేసుకొని ఓటమి లేకుండా ఎనిమిది పాయింట్లు సాధించి రూ.లక్ష నగదు బహుమతిని అందుకున్నాడు. వంద ఇంటర్నేషనల్ ఎలో రేటింగ్ పాయింట్లు మెరుగు పరుచుకొని రెండు వేల రేటింగ్ పాయింట్ల జాబితాలోకి చేరాడు. మరికొన్ని రోజులు ఫ్రాన్స్ లో ఉండి ఇంట ర్నేషనల్ మాస్టర్ టైటిల్‌తో తిరిగి ఇండియాలో అడుగుపెడతాడని కోచ్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు.



హాకీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా మధు

పలాసరూరల్: జిల్లా హాకీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పలాస మండలం మాకనపల్లికి చెందిన ఉపాధ్యాయుడు సైని మధు నియమితులయ్యారు. శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో ఈయనను ఎన్నుకున్నారు. ఈయన ప్రస్తుతం సోంపేట మండలం పాలవలస జడ్పీహెచ్ఎస్‌లో పీడీగా పని చేస్తున్నారు. గ్రామస్థులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

వీఆర్వోపై ఫిర్యాదు

సంతబొమ్మాళి: వడ్డితాండ్ర వీఆర్వో కామేశ్వరరావుపై కొత్తూ రు గ్రామానికి చెందిన సాహుకారి జోగారావు సోమ వారం కలెక్టర్ నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమం లో ఫిర్యాదు చేశాడు. వడ్డితాండ్ర రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్‌6-7లో ఉన్న తన భూమిని తక్కువగా రికార్డులో చూపిస్తున్నాడని ఆ ఫిర్యాదు లో పేర్కొన్నాడు. గతంలో తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తప్పుడు నివేదిక ఇచ్చాడని, అతని చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి. నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
➤ శుభాకాంక్షలు
➤ ధన్యవాదాలు
➤ వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066

ఉద్యమ స్ఫూర్తి 'గరిమెళ్ల'

● జయంతి, వర్ధంతులను అధికారికంగా చేపట్టాలి
● మాజీ ఎమ్మెల్యే కేపీఎన్ భుక్త

ప్రియాగ్రహారం(పోలాకి): 'మాకొద్దీ తెల్లదొరమంటూ' గర్జించి స్వాతంత్ర్య సమరంలో ఉద్యమ స్ఫూర్తి రగిలించిన వ్యక్తి గరిమెళ్ల సత్యనారాయణ అని మాజీ ఎమ్మెల్యే కేపీఎన్ భుక్త అన్నారు. స్వాతం త్ర్య సమరయోధుడు, జాతీయ గేయ కవి గరిమెళ్ల 131వ జయంతి ఉత్సవాన్ని సోమవారం ప్రియాగ్రహారం జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గరిమెళ్ల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభు త్వం అధికారికంగా చేపట్టడం ద్వారా ఆయన స్వాతంత్ర్యసమరంలో ఆయన చేసిన త్యాగాన్ని గుర్తించిన వారవుతారన్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాకు గరిమెళ్ల జిల్లాగా ప్రకటించాలన్నారు. ప్రియా గ్రహారంలో గరిమెళ్ల ఏర్పాటు చేసిన శారదా గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలని, ఆయన రచనలను పునర్ముద్రించి గ్రంథాలయాలు, పాఠశాలలకు అందించాలని కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎంపీటీసీ ప్రసాద్, హెచ్ఎం విశ్వేశ్వరరావు, ప్రిన్సిపాల్ సింహంబట్ల నాగకుమారి, బాడాన రాజు కోరారు. అనంతరం పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. గరిమెళ్ల రాసిన మాకొద్దీ తెల్లదొరతనమూ.. పాటను ఇలపండ గణపతి లయబద్ధంగా పాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దు అప్పయ్య, దుబ్బ కోటేశ్వరరావు, గోపి, ధనుంజయ, మద్దు అప్పలరాజు, రామారావు, గరిమెళ్ల కుటుంబ సభ్యులు, ఎలిమెంటరీ, ఉన్నత పాఠశాల, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కుమారుడిని అప్పగించాలని మహిళ ఆందోళన

పలాస: బలవంతంగా తన కుమారుడిని తీసుకువెళ్లిన భర్త చెర నుంచి కాపాడి తనకు అప్పగిం చాలని పలాస అన్నపూర్ణ ఆశ్రమం కాలనీకి చెందిన నెయ్యిల అరుణ వేడుకున్నారు. ఈ మేరకు కేటీ రోడ్డు ఆర్టీసీ కాంప్లెక్స్ వివేకానంద విగ్రహం వద్ద సోమవారం వర్షంలో ఆందోళనకు దిగింది. దీనికి సంబంధించిన బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వజ్రపుకొత్తూరు మండలం సంకర జగన్నాథపురానికి చెందిన నెయ్యిల లోకేష్‌తో అరుణకు 2019లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడున్నాడు. వివాహమైన రెండు నెలల నుంచి ఇద్దరి మధ్య పొరపొచ్చాలు వచ్చాయని, పెద్ద మనుషులు, కుటుంబీకులు ఎంత సర్దిచెప్పినా ఫలితం లేకపోయిందన్నారు. భర్త వేధింపులు ఎక్కువ కావడంతో కన్నవారి గ్రామం పలాస వచ్చి ఇక్కడే ఉండి పోయానన్నారు. తన కుమారుడిని పంపించాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తన వద్దకు పంపించారని, ఆ తరువాత పోలీసులు తండ్రి వద్దకు పంపించాలని ఒకసారి, గ్రామంలో సంబరాలు ఉన్నాయని మరోసారి, తన మామకు ఒంట్లో బాగో లేదని.. ఇలా అనేకమార్లు పోలీసులు ఫోన్ చేసి ఇబ్బందులు పెట్టారన్నారు. పోలీసుల అండతోనే ఓ సారి భర్త లోకేష్ తనపై దాడి చేసి కుమారుడిని తీసుకెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తన కుమారుడ్ని అప్పగించాలని అభ్యర్థించింది. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడును వివరణ కోరగా కుమారుడిని తండ్రి చూసుకునేందుకు వీలుగా వారి మధ్య ఒప్పందం జరిగిందని, ఆ విధంగానే కుమారుడిని తండ్రి తీసుకువెళ్లాడన్నారు. తండ్రి చావు బతుకుల్లో ఉన్నందున మనుమడికి చివరి చూపైనా చూపిస్తానని భర్త లోకేష్ కోరి తీసుకువెళ్లాడన్నారు. భార్యాభర్తల వ్యవహారంలో తాము ఎవరి పక్షాన ఉండబోమని, చట్ట ప్రకారం అంతా జరుగుతుందని స్పష్టం చేశారు.

ఎడమ కాలువలో గుర్రపు డెక్క తొలగింపు

హిరమండలం: మహాలక్ష్మీపురం వద్ద వంశధార ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్కను సోమవారం వంశధార అధికారులు తొలగించారు. ఈ నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'ఇది కాలువే' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏఈ ధనంజయరావు దగ్గరుండి ఎక్స్‌కవేటర్‌తో గుర్రపు డెక్కను తొలగించారు. శివారు భూములకు సాగు నీరందించేందుకు చర్యలు తీసు కుంటున్నామని వంశధార ఎస్ఈ బి.రాంబాబు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పలాస: పసికందుపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సూదికొండ కాలనీ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. వ్యవస్థలో స్త్రీలపై ఉన్న దృక్పథం మారాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కంప సరస్వతి, గౌరమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

పశు వైద్యులను నియమించాలి

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఐదేళ్లుగా పశు వైద్యులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలుగు యువత మండల అధ్యక్షుడు పరమేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జానకమ్మను రైతులతో కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉందని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. పశు వైద్యులను నియమించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకుడు దుక్క జోగారావు తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎంజీఆర్ పరామర్శ

పాతపట్నం: ఎస్ఎస్‌మణుగు గ్రామ మాజీ సర్పంచ్ కేలం కామేశ్వరరావును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం పరామర్శించారు. పాతపట్నంలో సోమవారం ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై స్థానిక సీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న నేపథ్యంలో ఎంజీఆర్ పరామర్శించి మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు.

మృతుడి కుటుంబానికి కలమట..

కొత్తూరు: కాశీపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొర్ను గణపతిరావు ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ మూర్తి సోమ వారం పరామర్శించారు. గణపతిరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కలమటతో పాటు పలువురు నేతలున్నారు.

బోగస్ పింఛన్లను నిలుపుదల చేయండి

జలుమూరు: సైరిగాం గ్రామంలో బోగస్ దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశా రు. ఎటువంటి దివ్యాంగత్వం లేకుండా ముడుపులు చెల్లించి నకిలీ సర్టిఫికేట్లతో పింఛన్లు అందుకుంటున్నారని, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

18న శ్రీముఖలింగేశ్వరాలయ హుండీ లెక్కింపు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయం హుండీలని ఈనెల 18న ఉదయం 10 గంటలకు లెక్కిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీని తెరిచి లెక్కించనున్నామని, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన వచ్చన్నారు.

కాలువల్లో నీరు.. ఆనందంలో రైతులు

సంతబొమ్మాళి: ఒకవైపు వర్షం కురవడం, మరో పక్క వంశధార కాలువల ద్వారా నీరు ప్రవహించడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాలువల ద్వారా నీరు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసు కువెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాతన మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కాలువల్లోని పూడికలు తొలగించడం, వంశధార ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంలో కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. బోరుభద్ర, సంతబొమ్మాళి, సవరపేట, జొన్నలపాడు, లక్ష్మీపురం తోపాటు పలు గ్రామాల్లోని పిల్ల కాలువల్లోకి సాగునీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బోరుభద్రలో సోమవారం జిల్లా తెలుగు యువత నాయకుడు వజ్జ ప్రభాకర్, సంతబొమ్మాళిలో కూశెట్టి కాంతారావు, చల్ల జగ్గారావు తదిత రులు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు.



బోరుభద్రలో గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో లయన్స్ సేవలను విస్తృతం చేయాలి

నరసన్నపేట: గ్రామాల్లో పేదలకు విద్య, వైద్య పరంగా లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలని లయన్స్‌క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డీఎస్ఎస్‌వీ వర్మ అన్నారు. ఆదివారం ఒక కల్యాణ మండపంలో నరసన్నపేట లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో పేదలకు సాయం చేయడంతో పాటు అత్యవసర సమయంలో రక్తదానానికి లయన్స్‌క్లబ్ సభ్యులు సిద్ధంగా ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రమణసాహూ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు సదాశివుని కృష్ణ , వారణాశి నాగరాజు, ఉణ్ణవెంకటేశ్వరరావు, ఉణ్ణ రంగనాథ్, పి.రమేష్, కొరాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అర్జవెల్లి ఉమామహేశ్వరరావు అన్నారు. వజ్రపు కొత్తూరు హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారాలు, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు నెయ్యిల సూర్యనారాయణ, కృష్ణ, కదంబాల హేమసుందర్, శేషు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 42 మంది ఎంపిక

మందస: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మందస సత్యసాయి బృందావన్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ వైద్యులు చల్లా గిరిజన 103 మందికి కంటి పరీక్షలు చేసి 42 మందిని కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వూన ఈశ్వరరావు, మాజీ కన్వీనర్ సుంకర శంకరరావు, బైరాగి మాస్టారు, వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

టెక్కలి: ద్విచక్రవాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ వాడకం ద్వారా కలుగు ప్రయోజనాలపై సోమవారం న్యాయవాదులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కోర్టు సముదాయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వాహన చోదకుడు హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాయిరాజు, ఆనందరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సదస్సులు

నందిగాం: కొత్తగ్రహారం, దేవపురం గ్రామాల్లో సోమవారం కౌలురైతుల అవగాహనా సదస్సులు నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ.. ప్రతి కౌలురైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డు పొందాలన్నారు. దీనివల్ల ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలు పొందే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా వీఆర్వోలు, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అద్దె వాహనమునకు ప్రకటన

జిల్లాలోని కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలకు ద్రవ నత్రజని, వీర్యనాళికల సరఫరా నిమిత్తం 6 వెడల్పు X17 పొడవు సైజు గల వాహనము ఒక సంవత్సర కాలము నడుపుటకు సీల్డుకవరు టెండర్లు కోరడమైనది. టెండరు ఫారములు ఈ దిగువ కార్యాలయము పనిదినములలో 18.07.2024 నుండి 24.07.2024 సాయంత్రం 5PM వరకు ఇవ్వబడును.

కార్యనిర్వహణాధికారి,
జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, అరసవల్లి, శ్రీకాకుళం.
8008204162, 9059877559

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, జగన్నాథ స్వామి కోవెలవీధి, ప్రత్తి మార్కొండేయులు (లేటు) భార్య ప్రత్తి విమల పార్వతి ఇస్తున్న బహిరంగ ప్రకటన.

నా క్లయింట్ ప్రత్తి విమల పార్వతికు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెగలరు. రెండవ కుమారుడైన ప్రత్తి రాజేష్ తేది 29.09.2023న మరణించినాడు. ఈ విషయమై ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ వారు క్రైం.నె.230/2023 కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు.

సదరు ప్రత్తి రాజేష్‌కు భార్య, పిల్లలు కలరు. భార్య పేరు ప్రత్తి సునీత, కుమార్తె పేరు ప్రత్తి హిమజ, కుమారుడు పేరు ప్రత్తి కార్తికేయ.

సదరు లేటు ప్రత్తి రాజేష్‌కు, నా క్లయింట్ అయిన ప్రత్తి విమల పార్వతి, అతని భార్యా, పిల్లలు వారసులైయున్నారు.

సదరు లేటు ప్రత్తి రాజేష్ యొక్క ఆస్తులలో పైన తెలిపిన నా క్లయింట్ అయిన ప్రత్తి విమల పార్వతి మరియు ప్రత్తి రాజేష్ భార్యా పిల్లలకు సమాన వాటాలు గలవు.

సదరు లేటు ప్రత్తి రాజేష్ యొక్క భార్య అయిన ప్రత్తి సునీత నా క్లయింట్ అయిన ప్రత్తి విమల పార్వతికి తెలియకుండా దురుద్దేశ్యంతో ఆస్తులను విక్రయించనున్నారని రూఢీగా నా క్లయింట్‌కు తెలిసినది.

సదరు లేటు ప్రత్తి రాజేష్‌కు సంబంధించిన ఆస్తులను అమ్మే అధికారం గాని, హక్కుగాని లేటు ప్రత్తి రాజేష్ యొక్క భార్య అయిన ప్రత్తి సునీతకు లేదు. ఈ ఆస్తులను ఎవరు కూడా కొనరాదు. ప్రత్తి సునీతకు ఆస్తులను అమ్మే అధికారం, హక్కు లేదు. అలా కాదనిఎవరైన రాజేష్‌కు సంబంధించిన ఆస్తులను కొన్నచో, కొనేవారికి ఎటువంటి హక్కు దఖలుపడదని ఈ బహిరంగ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయుడమైనది.

కళ్యాణి దేవి, ఎం.ఎ, బి.ఇడి, ఎల్.ఎల్.బి
అడ్వకేట్, సోంపేట, సెల్: 8008670482

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బిరం ట్యూ పార్క్ జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము తేది. 28.07.2024 నాడు వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ICHPUPJ2401220005	PRAKASH BEHERA GASYA	GPATMPJ2401250004	HARI KRISHNA TIYALA
ICHPUPJ2401060010	DHANALXMI DAKKATA	GPATMPJ2401240001	SRIDHAR SIRIPURAM
ICHPUPJ2401240008	GIRIDHARI BEHERA	GPATMPJ2401220006	TULASI RAO PARASELLI
ICHPUPJ2401240010	RAJU PANDI	GPATMPJ2401180002	MADDILI KARISHMA KUMAR
ICHPUPJ2310160009	PADMA PRAGADA	SCMPTPJ2310200001	ROHINI SIVANGI
ICHPUPJ2401220012	RAJESH KUMAR RAUL	TEKKAPJ2401080001	MEENAKSHI KARNIKA
ICHPUPJ2401270002	ESWAR SETHY	AMDVSPJ2401190003	KRISHNA MAJJI
ICHPUPJ2401300002	RAJU PANDI	AMDVSPJ2401030001	MUKKAMULA MURALIKRISHNA
ICHPUPJ2401300003	RAJU PANDI	AMDVSPJ2401200005	KRISHNA MAJJI
ICHPUPJ2401220011	RAJESH KUMAR RAUL	AMDVSPJ2401130001	MUKKAMULA MURALIKRISHNA
PALSAPJ2401310003	HYMAVATHI BRAMADEVU	RNSTMPJ2401200002	RAMAKRISHNA KONETI
PALSAPJ2401270005	MOHINI CHEEKATI	RNSTMPJ2401100004	SATYANARAYANA KALISETTI
GPATMPJ2401030003	BHULAXMI TIRUNAGARI	RNSTMPJ2401090002	RAMESH KOSTA
GPATMPJ2401030005	RANI NADIMINTI	SRKL2PJ2401060004	SRI VENI THAI
GPATMPJ2401080005	LAKSHMANARAO ANGURU	SRKL2PJ2401030001	APPALACHARI VOMARAVILLI
GPATMPJ2401060001	NADIMINTI RAMYA	SRKL2PJ2401030003	BALARAJU CHEMALLA
GPATMPJ2401050003	VAIKUNTARAO BOYINA	SRKL2PJ2401100003	DUNDU BHASKARARAO
GPATMPJ2401080003	RANI NADIMINTI	SRKL2PJ2401310003	RAMANAMMA GANGU
GPATMPJ2401130002	KODANDA RAO REDDY	SRKL2PJ2401100011	APPALANAIDU GONDU
GPATMPJ2401310009	KARTEEK POLUBOTHU	SRKL2PJ2401190001	KRISHNA VENI NAGULAPALLI
GPATMPJ2401200006	SANTHAMMA MARANGI	SRKL2PJ2401130007	SURYADU BUDUMURU
GPATMPJ2401230001	VIJAYKUMAR SAILAPU	SRKL2PJ2401180005	KRISHNA VENI NAGULAPALLI
GPATMPJ2401240006	MADHURI	SRKL2PJ2401100002	DUNDU BHASKARARAO
GPATMPJ2401030004	PRAVALLIKA BHADRACHALAM	SRKLMPJ2401020001	KURMANA SRILAKSHMI

క్రింద ఉదహరించిన చిరునామా వద్ద వేలం వేయడం జరుగుతుంది: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, D.NO-4000A/47,1వ అంతస్తు,సరస్వతి కాంప్లెక్స్, బాకర్‌సాహిబ్ పేట, శ్రీకాకుళం -532001. వేలం సమయం: 11.00 AM

మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.రవి కిరణ్ ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 15.07.2024
స్థలం:శ్రీకాకుళం

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించినదని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీత/హామీదార్లను కోరుతూ రుణగ్రహీత/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీత/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు షెడ్యూల్‌లో ఆస్తిలో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు ఎటువంటి అవలంబన లేని ప్రాతిపదికన తేది: **26 జూలై, 2024న మ.12.30గం. నుండి మ.3.30 గం.వరకు** (ఇ-వేలం సమయం) ఇ-వేలం విక్రయం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు

క్రమ.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా నం	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేది	స్థూల బరువు	నికర బరువు
1	కాశిబుగ్గ- పలాస (ఏపి)	xxxxxxxxxxxx6901	శాంతి మద్దు	97199	07-జూన్-24	22.7	20.8
2	శ్రీకాకుళం (ఏపి)	xxxxxxxxxxxx3020	కొరడ తాయారు	585366.15	07-జూన్-24	139.5	135.8

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్పు చేయు/ఖాతాను తొలగించు హక్కు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ కలిగియున్నది. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ విక్రయదారు వెబ్‌సైట్) మ.12.30 గం. నుండి మ.3.30 గం. (సమయం) వరకు నిర్వహించబడుతుంది. సవివరమైన నియమనిబంధనల కొరకు ఇవి ఇవ్వబడిన వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ విక్రయదారు వెబ్‌సైట్)కు లాగిన్ చేయగలరు.

ప్రదేశం : శ్రీకాకుళం జిల్లా | అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

అమ్మవారి వారాలకు వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- బైక్‌ను ఢీకొన్న వ్యాన్.. యువకుడి మృతి
- పొందూరులో ఘటన.. విషాదంలో కుటుంబం



దుర్గాప్రసాద్ (ఫైల్)

పొందూరు: విజయవాడలో డ్రైవర్‌గా జీవనోపాధి పొందుతున్న ఆ యువకుడు గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న గ్రామదేవత ఉత్సవం కోసం ఆదివారం వచ్చాడు. ఈ క్రమంలో పండగ జరుపుకునేందుకు సామగ్రి కోసం స్నేహితుడితో కలిసి బైక్‌పై సోమవారం మండల కేంద్రం పొందూరు మార్కెట్‌కు వస్తుండగా.. కళాశాల రోడ్డులో ఓ ఫౌల్ట్రీ వ్యాన్ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తండ్యాం పంచాయతీ తండ్యాంమెట్ట (శ్రీరాం నగర్ కాలనీ)కు చెందిన చేనేత కార్మికులైన కాకర్ల కృష్ణ, కొండమ్మ కుమారుడు దుర్గాప్రసాద్ (26). డిగ్రీ వరకు చదువుకున్నా చేనేత వృత్తి చేసుకోలేక, వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా ఉండేందుకు విజయవాడ వెళ్లి డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలో జరిగే అమ్మవారి పండగలో పాల్గొనేందుకు ఆదివారం వచ్చాడు. దేవుడి సామగ్రి తెచ్చుకునేందుకు స్నేహితుడు కావూరి చిన్నారావుతో కలిసి సోమవారం బైక్‌పై పొందూరు బయలుదేరాడు. కాలేజీ రోడ్డుకు చేరుకున్న సమయంలో ఎదురుగా వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడిపోగా.. దుర్గాప్రసాద్ తలపై నుంచి ఆ వ్యాన్ చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా చిన్నారావుకి చేయి విరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఆ వ్యాన్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా వ్యాన్ వివరాలు తెలుసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఆ వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించారు. గాయపడిన చిన్నారావును చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దుర్గాప్రసాద్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. కాగా పండగ కోసం గ్రామానికి వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కృష్ణ, కొండమ్మ కన్నీరుమున్నీరయ్యారు. దుర్గాప్రసాద్ మృతితో తండ్యాంమెట్ట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

భూమి రాయాలని తల్లిపై ఒత్తిడి

- వారించేందుకు ప్రయత్నించిన పెద్దమ్మ
- చేయి చేసుకోవడంతో కిందపడి మృతి



నర్సమ్మ మృతదేహం

హిరమండలం: తనపేరు మీద భూమి రాయాలని తల్లిపై ఒత్తిడి చేసిన కుమారుడిని అతడి పెద్దమ్మ వారించింది. ఈ క్రమంలో ఆ వ్యక్తి చేయి చేసుకోవడంతో ఆమె కిందపడి మృతి చెందిన ఘటన మహాలక్ష్మీపురం కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ స్వామి తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని తోణంగి లక్ష్మణరావు కుటుంబానికి 20 సెంట్ల భూమి ఉంది. తాను అప్పుల్లో ఉన్నానని, భూమిని తన పేరుమీద రాయాలని తల్లి అమ్మన్నను కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఆదివారం కూడా ఇదే రీతిలో ఆమెను సంతకం చేయాలని గొడవ చేశాడు. ఈ నేపథ్యంలో పక్కనే కూర్చున్న అమ్మన్న సోదరి నర్సమ్మ (86) లక్ష్మణరావును వారించింది. అయితే ఇందులో నీకేంటి సంబంధమంటూ ఆమె చెంపపై కొట్టాడు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న నర్సమ్మ గురక వచ్చి కిందపడిపోయింది. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తీసుకు వెళ్లేందుకు ఆటో ఎక్కించే సరికి మృతి చెందింది. ఈమె భర్త, కుమార్తె గతంలోనే మృతి చెందారు. ఈ ఘటనపై సోమవారం అమ్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కొత్తూరు సీఐ వేణుగోపాలరావు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

భార్యపై కత్తితో దాడి

ఇచ్ఛాపురం: మద్యం మత్తులో కట్టుకున్న భార్యపై కత్తితో దాడిచేసి ఘటన ఇచ్ఛాపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముడియావీధికి చెందిన సుదర్శన శ్రీను, దుర్గ భార్య, భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను ఒక ప్రైవేట్ వాహనంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ మద్యం తాగి వచ్చి.. భార్యపై అనుమానంతో గొడవ పడుతుండేవారు. రోజూ లాగానే ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చిన శ్రీను భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న కత్తితో దుర్గపై దాడి చేశాడు. దీంతో ఆమె తలపై, చేతులపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆమెన ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. దాడికి పాల్పడిన శ్రీను పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు.

ఆదిత్యుని దర్శించుకున్న నూతన ఎస్పీ



స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఈవో, అర్చకులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ వారికి స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ అందజేశారు. శ్రీకాకుళం వన్‌టౌన్ సీఐ ఎల్ఎస్ నాయుడు, టూ టౌన్ సీఐ ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ అవతారం, వన్ టౌన్ ఎస్ఐలు నక్క రామకృష్ణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైం: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేవీ మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో అసోసియేషన్ సభ్యులు కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసుల సంక్షేమం కోసం పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అసోసియేషన్ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ కె.రాధాకృష్ణ, రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ ఎం.అరుణకుమారి, జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణం నాయుడు, ట్రెజరర్ కె.భుజంగరావు, కార్యవర్గ సభ్యులు పి.నర్సింహులు, ఎం.జగదాంబ తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాలను, సెక్షన్లను సోమవారం రాత్రి ఎస్పీ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, పనితీరుపై ఆరా తీశారు. పోలీసు కంట్రోల్ రూమ్, డీసీఆర్బీ, సైబర్ సెల్, ఐటీకోర్, పోలీసు కార్యాలయంలోని ఏబీసీ సెక్షన్స్ పరిశీలించారు. ఎస్పీ వెంట కార్యాలయ ఏవో సీహెచ్ గోపీనాథ్, సీఐలు ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, ఎస్ఐ నేతాజీ, సీసీ శివప్రసాద్ తదితరలు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు..

ఆమదాలవలస: జిల్లా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన మహేశ్వరరెడ్డిని ఎస్సీ, ఎస్టీ సంఘా నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ చీర రాజేశ్వరి, జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లిసురేష్ కలిసి, సత్కరించారు. వీరితో పాటు సంఘ ప్రతినిధులు గొల్లపల్లి శశికుమార్, సిరిపల్లి వసంత్, గొల్లపల్లి బుజ్జి, మహేష్, తారకేశ్ ఉన్నారు.

24 ఫిర్యాదుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీలు

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమానికి 24 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో కుటుంబ తగాదాలపై నాలుగు, సివిల్ తగాదాలపై ఐదు, చీటింగ్‌పై మూడు, సైబర్ నేరాలపై ఒకటి, ఇతర తగాదాలపై 11 అందాయి. వీటిని బాధితుల నుంచి ఏఎస్పీలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులకు సంబంధించి ఆయా స్టేషన్ల ఇన్‌చార్జీలతో ఏఎస్పీలు ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

జగన్నాథుడికి పూజలు

- వివిధ రూపాల్లో స్వామివారి దర్శనం
- కొన్నిచోట్ల మారు రథయాత్ర



పలాసరూరల్: తర్లాకోటలో మారు రథయాత్ర



పలాస: జగన్నాథుని దర్శించుకుంటున్న భక్తులు



జలుమూరు: బైరాగిపేటలో.. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు



మందస: మారు రథయాత్రలో స్వామివారి ఊరేగింపు



ఇచ్ఛాపురం: కొళిగాం గ్రామంలో..

జిల్లా వ్యాప్తంగా జగన్నాథ స్వామి యాత్ర సోమవారం సందడిగా సాగుతుంది. కొన్నిచోట్ల మారు రథయాత్ర చేపట్టారు. మరికొన్ని చోట్ల స్వామివారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

\- ఆంధ్రజ్యోతి బృందం



ఎల్ఎన్ పేట: కల్కి అవతారంలో..



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివారి వీధిలో..



నరసన్నపేట: శ్రీమహావిష్ణువు అవతారంలో..



టెక్కలి: స్వామివారి ఊరేగింపు..



పాతపట్నం: మారు రథయాత్ర



హిరమండలం: రథంపై ఊరేగింపుగా..

స్వామి సన్నిధిలో నేస్తరికం

ఇచ్ఛాపురం: జగన్నాథ రథయాత్రలో నేస్తరికం కట్టడం ఈ ప్రాంతంలో విశేషంగా ఉంటుంది. ఆంధ్రా-ఒడిశా సంప్రదాయం ప్రకారం రథత్సవం తొమ్మిది రోజుల్లో చాలా మంది నేస్తాలు కడతారు. స్వామివారి సన్నిధితో ప్రమాణ పూర్వకంగా మైత్రి బంధాన్ని ఏర్పరుచుకుంటారు. రెండు కుటుంబాల మధ్య ఒప్పందం ప్రకారం ఒకే వయసు గల పిల్లలు, పెద్దలు నేస్తాలు చేస్తారు. నేస్తాలు కట్టుకొనే వారికి కుల, మత బేదం ఉండదు. ఈ తంతు వివాహ కార్యక్రమంలా సాగుతుంది. ఇకపై వారు ఒకరినొకరు పేరు పెట్టి పిలవకుండా.. నేస్తం అంటూ సంబోదించుకుంటారు. వారి ఇళ్లల్లో ఏ కార్యక్రమం జరిగినా తొలిపిలుపు నేస్తం కుటుంబానికే. ఈ క్రమంలో చివరి రోజు జగన్నాథ స్వామి మారు రథయాత్ర సందర్భంగా సోమవారం పలువురు నేస్తాలు కట్టుకున్నారు.

సహారా బాధితులకు న్యాయం చేయండి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద ఆందోళన చేస్తున్న సహారా బాధితులు

అరసవల్లి: సహారా ఇండియా ఖతాదారులకు వెంటనే తమ డిపాజిట్ సొమ్ము చెల్లించి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, సహారా ఇండియా పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు బోయిన సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్థలో కోట్లాది మంది పెట్టుబడులు పెట్టారని, సుప్రీంకోర్టు 2015లో 15శాతం వడ్డీతో బాధితులకు వారి డిపాజిట్ సొమ్మును చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు పట్టించుకునే నాథుడే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే దీనికి కారణమని విమర్శించారు. దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది బాధితులు ఉన్నారని, జిల్లాలో లక్ష మంది వరకు ఉన్నారన్నారు. వీరికి సుమారు రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. సెంట్రల్ రిజిస్టర్ కోపరేటివ్ సొసైటీ ద్వారా దేశంలోని ప్రతీ ఖాతాదారునికి చెల్లింపులు చేస్తామని కేంద్రమంత్రి అమిత్ షా గతేడాది జూలైలో ప్రకటించారని, కానీ నేటికి బాధితులకు ఎటువంటి చెల్లింపులు జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, కార్యదర్శి ఎస్.గణపతి, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్, సహారా ఖాతాదారులు, ఏజెంట్లు డీఎస్ మోహనరావు, బి.చిరంజీవిరావు, బి.సత్యనారాయణ, పి.బాబూరావు, సీహెచ్ మాధవ రావు, కేవీపీ రావు, బీవీ రమణ, వి.కాశీవిశ్వనాథ్, పి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సంఘ నాయకులు

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ చట్టం అమలు చేసి, తన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసంలో కలెక్టర్‌కు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి హరనాథ్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు లక్ష నిర్మాణ కార్మిక కుటుంబాలు సంక్షేమ చట్టం నిలుపుదల వల్ల ఇబ్బంది పడుతున్నాయన్నారు. చట్ట ప్రకారం నిర్మాణ యజమానుల నుంచి 1శాతం సెస్సు వసూలు చేసి క్లెయిమ్‌ల చెల్లింపులు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదన్నారు. గత ప్రభుత్వం సెస్సు వసూలు చేసి, క్లెయిమ్ చెల్లింపులు చేసిందని మండిపడ్డారు. ఇలా వసులు చేసిన సెస్సును ఇతర అవసరాలకు మళ్లించిందని వాపోయారు. ఇది సుప్రీం తీర్పుకు వ్యతిరేకమన్నారు. పక్కనున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో సంక్షేమ చట్టం అమలవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లను చెల్లించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

సంపూర్ణ సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మ్‌డ్ పోలీస్ విభాగం సంపూర్ణ అందించిన సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించగలిగామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆమెను సోమవారం ఎచ్చెర్ల పోలీస్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ యంత్రాంగం ఆధ్వర్యంలో సెరేమోని పరేడ్ నిర్వహించి ఎస్పీకి గౌరవ వందనం సమర్పించి, ఘనంగా వీడ్కోల్ పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెండున్నరేళ్లలో ప్రజలు, పోలీసులు సహాయ, సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి



ఉపకార వేతనాలు అందిస్తున్న ఎమ్మెల్యే

ఆమదాలవలస: నియోజకవర్గంలో ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కేంద్రం ప్రభుత్వం అందించే ఉపకార వేతనాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాష్ట్రంలో విద్యా ఉన్నతికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆమదాలవలసలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు ప్రయత్నాలు ఫలించాయన్నారు. రానున్న రోజుల్లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా, టీడీపీ నాయకులు నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, బోయిన సునీత, ఎన్ని శ్రీదేవి, జీడి ప్రసాద్, అన్నెపు భాస్కరరావు, మురళీధరరావు, కె.వెంకటరాజ్యలక్ష్మి, ఎంఈవోలు, తదిరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా పనిచేసి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధిద్దామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ టీడీపీ నగర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల పార్టీ జిల్లా కార్యాలయంలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శంకర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, నాయకులు జామి భీమశంకర రావు, ముద్దాడ కృష్ణమూర్తి, కలగ జగదీష్, సింతు సుధాకర్, 50 డివిజన్ల ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గుజరాతీపేట: యువత ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక మహిళా కళాశాలలో సోమవారం ఇంటర్నేషనల్ స్కిల్ డే నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా అందించే వివిధ పథకాల కోసం వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఇండస్ట్రీ ప్రమోటర్ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, జీఎం రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా చార్జిషీట్లు వేయాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి మౌలానా

గుజరాతీపేట: వివిధ కేసుల్లో చార్జిషీట్లు త్వరగా వేసేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర, జైలు సూపరింటెండెంట్లు, సబ్‌జైలు అధికారులు, పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు.

అతివేగంతో అకాల మరణాలు

వాహనాలు అతివేగంగా నడపడం వల్ల ఎక్కువగా అకాల మరణాలు సంభవిస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ లా కళాశాల ఆవరణలో సోమవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మోషి, అడ్వకేట్ ఐ.పాపాయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాబాయ్ దేశముఖ్ జీవితం ఆదర్శనీయం



దేశముఖ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మహిళా అభ్యున్నతికి, జాతీయ సమైకతకు ఎనలేని కృషి చేసిన దుర్గాబాయ్ దేశముఖ్ జీవితం ఆదర్శనీయమని బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ కేఆర్ రజిని అన్నారు. దుర్గాబాయ్ జయంతి సోమవారం వర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం.అనురాధ, సీహెచ్ రాజశేఖర్, ఓఎస్‌డీ కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు. అలాగే రీసెర్చ్ ఫోరమ్ కార్యక్రమం సోమవారం వర్సిటీలో నిర్వహించారు. రిజిస్ట్రార్, బయోటెక్నాలజీ ఆధ్యాపకురాలు పి.సుజాత ఆధ్వర్యంలో కేన్సర్ నివారణపై ప్రచురితమైన పుస్తకాన్ని వీసీ కేఆర్ రజిని ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో సంతోషిమాతకు పూజలు



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయంలో సోమవారం అమ్మవారి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ మహాగణపతి పూజ జన్మదిన సంకల్పం పునః పూజలు నిర్వహించారు. శతకలశాభిషేకం 108లీటర్లతో మహా క్షీరాభిషేకం చేపట్టారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ విశేషపుష్ప అలంకరణ చేశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీల తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉద్యానవన మొక్కలకు ప్రాధాన్యం

లావేరు: ఉపాధి హామీ పథకంలో ఉద్యాన వన మొక్కలు పెంపకానికి ప్రాధానం ఇవ్వాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ అన్నారు. సోమవారం శహపురం, చిన్నయ్యపేట, మురపాక, కేశవరాయునిపాలెం, పెదరావుపల్లి తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉద్యాన వన పంటలను ఆయన పరిశీలించారు. కొబ్బరి, జీడిమామిడి, మునగ, పామాయిల్, సపోటా, జామ తదితర మొక్కలు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. ఏపీవో సత్యవతి, జేఈ లెలిన్‌బాబు, టీఏలు ఉన్నారు.

నేటి నుంచి రెండు రోజులు నగరంలో తాగునీటి సరఫరా బంద్

శ్రీకాకుళం అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని బలగ హెడ్ వాటర్ వద్ద మరమ్మతు పనులు జరుగుతుందున 16, 17 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు కమిషనర్ చల్లా ఓబులేసు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా బలగ నుంచి సరఫరా అయ్యే శాంతినగర్ కాలనీ, నానుబాలవారి వీధి, కారుకుర్తి వారివీధి, పాండురంగ వీధి, కృష్ణాపార్కు ఏరియా, నెహ్రూ రోడ్డు, పుణ్యపువీధి, బుక్కావారి బంద, ఇలిసిపురం, బలిజేపల్లి వీధి, చిన్నబజార్, హడ్కోకాలనీ, బలగ, రిమ్స్ హాస్పటల్ ఏరియా, రాయ్ లేఅవుట్ కాలనీ, మహిళా మండల వీధి, తురాయి చెట్టు వీధి, వైష్ణవ వీధి, కెల్లవీధి, దుర్గాదేవి గుడి ఏరియా, గుడివీధి ఏరియాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. మరమ్మతుల అనంతరం తాగునీటి సరఫరా కొనసాగుతుందని వివరించారు.

18 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు

కలెక్టరేట్: ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠువ్యాధిగ్రస్థులను గుర్తించే కార్యక్రమం చేపట్టనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక వద్ద ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌రావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ సిద్ధం చేయండి

ఆమదాలవలస: పట్టణంలోని బస్టాండ్ వద్ద అసంపూర్తిగా ఉన్న అన్న క్యాంటీన్ భవన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అన్న క్యాంటీన్ భవనాన్ని సందర్శించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదలందరికీ ఉచితంగా భోజనం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని, అందువల్ల ఇక్కడ కూడా సిద్ధం చేయాలని ఏఈ అప్పలనాయుడుకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, చంద్రశేఖర్, నూకరాజు, ఆంజనేయులు, శ్రీదేవి, భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికలు రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 17వ తేదీన సీనియర్ సాఫ్ట్‌బాల్ పురుషులు, స్త్రీ పోటీలకు జిల్లాస్థాయి ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు ఎంపికల స్థలానికి హాజరై ఆర్గనైజింగ్ కార్యదర్శి వద్ద రిపోర్టు చేయాలన్నారు.

మూగజీవాలకు వ్యాక్సిన్లు

బూర్జ: టీఆర్‌రాజుపేట గ్రామంలో గొర్రెలు, మేకలకు నీలినాలుక వ్యాధి టీకాలు సోమవారం వేశారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పీరుకట్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో వ్యాక్సిన్లు వేయించారు. ప్రమాదం బారిన పడిన మూగజీవాలకు ఇన్సూరెన్స్ రాలేదని ఆ సంఘ నాయకులు మాజీ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. కొల్లివలస, బూర్జ పశువైద్యులు వెంకటరావు, జ్యోత్స్న పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

రణస్థలం: పైడిభీమవరం పంచాయతీ సరగడపేట గ్రామానికి చెందిన వై.సూర్యనారాయణ గుండె నొప్పితో బాధపడుతున్నాడు. ఆయనకు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం రూ.లక్ష సాయాన్ని అందించింది. ఈ మేరకు పరిశ్రమ ప్రతినిధులు కేవీఎన్ రాజు, జోగారావు, దీపక్ చెక్‌ను సోమవారం అందజేశారు.

మార్కెట్ రోడ్డుకు మోక్షం

పొందూరు: దశాబ్దాల కిందట పూర్తిగా ధ్వంసమైన పొందూరు మార్కెట్‌రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎంఎస్ఎన్ కాంప్లెక్స్ ముందు ఉన్న సుమారు 20 మీటర్ల రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో నిత్యమూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం పడితే నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఈ సమస్యను ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ తీసుకువెళ్లడంతో అత్యవసర నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు ఆదేశించారు. దీంతో రోడ్డు నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. దీంతో స్థానికలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయాలని వినతి

సోంపేట: కొర్లాం పంచాయతీ పరిధిలో రైల్వేస్టేషన్‌లో ప్రహరీ నిర్మిస్తున్నారు. అయితే ఈ నిర్మాణంలో ఆ గ్రామానికి చెందిన పలువురి రైతుల భూములు కోల్పోతున్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, రైతులు కలిసి తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంలో చొరవ తీసుకొని బాధిత రైతులకు న్యాయం అందించాలని వారు కోరారు.